సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 10 । జనవరి । 2024



కిక్కిరిసిన 'తారుమారు'

తారుమారు సంతకు వచ్చిన గిరిజనులతో మండల కేంద్రం జి.మాడుగుల కిక్కిరిసిపోయింది.

8లో




ఘనంగా అష్టదళ పద్మారాధన

విశాఖ: కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

21న మోదకొండమ్మ తీర్థం

జిల్లా కేంద్రమైన పాడేరు మోదకొండమ్మ తల్లి తీర్థాన్ని ఈనెల 21వ తేదీన వైభవంగా జరిపేందుకు ఆలయకమిటీ నిర్ణయించింది.



8లో

న్యూస్‌రీల్

పాల్గుణకు అభినందన



చెట్టి పాల్గుణకు అభినందనలు తెలుపుతున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పార్టీ శ్రేణులు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణను వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ సమన్వయకర్త, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అభినందనలు తెలిపారు. మంగళవారం పాడేరులోని ఆయన స్వగృహానికి పార్టీ శ్రేణులతో ఆమె కలిసి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పాల్గుణ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, పెదబయలు సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కె.సురేష్, సర్పంచ్‌లు గబ్బాడి చిట్టిబాబు, వంతాల రాంబాబు, ఎంపీటీసీ కె.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలు సిద్ధం చేయండి

జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

చింతపల్లి రూరల్: ఓటర్ల జాబితాలను త్వరగా సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బూత్ లెవెల్, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీలో బీఎల్వోలు అన్ని జాగ్రత్తలు తీసుకుని ఎటువంటి తప్పిదాలు జరగకుండా చర్యలు చూడాలని సూచించారు. ఇప్పటివరకు సిద్ధం చేసిన ఓటరు జాబితాలు, ఫారం 6,7,8 వివరాలను ఆయన తెలుసుకున్నారు. తహసీల్దార్ లచ్చాపాత్రుడు పాల్గొన్నారు.

11న వాలీబాల్ పోటీలు, వైద్య శిబిరం

చింతూరు: మండలంలోని అల్లిగూడెంలో ఎస్పీ తుహీన్‌సిన్హా ఆదేశాల మేరకు /ఈనెల 11న ఆదివాసీ యువతకు క్రీడా పోటీలతోపాటు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సీఐ గజేంద్రకుమార్ మంగళవారం తెలిపారు. ఏడుగురాళ్లపల్లి, పేగ, లచ్చిగూడెం, తుమ్మల గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలకు చెందిన యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. దీంతోపాటు ప్రముఖ వైద్యులతో మెగా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విజేతలకు ఎస్పీ, ఓఎస్డీ, ఏఎస్పీలు బహుమతి ప్రదానం చేస్తారని, వైద్యశిబిరాన్ని సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వాలీబాల్ పోటీల్లో యువత పాల్గొని విజయవంతం చేయాలని సీఐ సూచించారు.

టీడీపీకి చెందిన న్యాయవాది వైఎస్సార్‌సీపీలో చేరిక

ఎటపాక: మండలంలోని ప్రముఖ న్యాయవాది అవులూరి సత్యనారాయణ టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం గుండాల ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఎటపాకలో ఆయనకు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. న్యాయవాది ఎస్సీ,ఎస్టీ న్యాయవాదుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు న్యాయవాది సత్యనారాయణ పేర్కొన్నారు.

వాహన రికార్డులు తనిఖీ



గంగవరంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీవో రాజేష్‌కుమార్, సిబ్బంది

గంగవరం: వాహనాల రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆర్టీవో ఆర్.రాజేష్ కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక వై.జంక్షన్‌లో ఆయన వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. సక్రమంగా లేని వాటికి అపరాధ రుసుం విధించారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలని సూచించారు. అడిషనల్ ఎస్‌ఐ జేబీఆర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సాహసం చేద్దాం రండి!

ఉమ్మడి విశాఖ జిల్లాలో మన్యం సాహస క్రీడలకు కేరాఫ్‌గా మారింది. ఆదాయం కూడా అదేస్థాయిలో సమకూరుతోంది. తొలుత తాజంగి, గిరిజన మ్యూజియంలో మాత్రమే ఉండే వీటిని ఇప్పుడు పర్యాటకశాఖ అనంతగిరి బొర్రా గుహల వద్ద అందుబాటులోకి తెచ్చింది.

- ఉమ్మడి విశాఖ జిల్లాలో సాహస క్రీడలకు కేరాఫ్‌గా మన్యం
- తాజంగి, బొర్రా, అరకు గిరిజన మ్యూజియం వద్ద ఏర్పాటు
- ఆసక్తి చూపుతున్న పర్యాటకులు
- పాడేరు ఐటీడీఏ, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- రూ.కోట్లలో ఆదాయం





బొర్రా గుహల వద్ద గోస్తనీ నది అందాలు తిలకించేందుకు జిప్‌లైన్‌పై విహరిస్తున్న పర్యాటకులు

అనంతగిరి: మన్యం అందాలను తిలకించేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. ఏమాత్రం తీరిక దొరికినా ఈ ప్రాంతాలను సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారు. పాడేరు ఐటీడీఏ, పర్యాటకశాఖలు కూడా వారి అభిరుచులకు అనుగుణంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నారు. దీనిలో భాగంగా చింతపల్లి మండలంలోని తాజంగి జలాశయం, గిరిజన మ్యూజియం, అనంతగిరి మండలంలో బొర్రా గుహలు వద్ద ఏర్పాటుచేసిన సాహస క్రీడలకు పర్యాటకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.

గోస్తనీ అందాలు తిలకించేలా..

జిల్లాలో గోస్తనీ నదికి ప్రత్యేకత ఉంది. అత్యంత లోయలో ఉండే ఈ నదికి ఇరువైపులా దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. ఇక్కడి ప్రకృతి అందాలను తిలకించేందుకు బొర్రా గుహలకు వచ్చే సందర్శకులు ఆసక్తి చూపుతుంటారు. వారి అభిరుచికి తగ్గట్టుగా పర్యాటకశాఖ గోస్తనీపై సుమారు రూ.65 లక్షల వ్యయంతో పర్యాటకశాఖ జిప్‌లైన్ ఏర్పాటు చేసింది. గత అక్టోబర్ 19 నుంచి అందుబాటులోకి తెచ్చింది. అప్పటినుంచి ఈ సాహస క్రీడకు పర్యాటకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. రూ.లక్షల్లో ఆదాయం తెచ్చిపెడుతోంది.

- అక్టోబర్ నెలలో 3257 మంది జిప్‌లైన్‌పై విహరించగా రూ.16,28,500 ఆదాయం వచ్చింది. ఇదేనెల 22 నుంచి 25 వరకు 1340 మంది విహరించగా రూ.6.85 లక్షలు సమకూరాయి.
- నవంబర్ నెలలో 4,108 మంది విహరించగా రూ.20.54 లక్షల ఆదాయం వచ్చింది. ఇదే నెలలో అత్యధికంగా 24,25 తేదీల్లో 954 మంది విహరించగా రూ.2,41,971 ఆదాయం సమకూరిందని అధికారవర్గాలు తెలిపాయి.
- డిసెంబర్‌లో జిప్‌లైన్‌పై విహరించేవారి సంఖ్య భారీగా పెరిగింది. నెల మొత్తమ్మీద 13,636 మంది విహరించారు. రూ.68,18,000 ఆదాయం వచ్చింది. ఇదే నెలలో 24 నుంచి 31 వరకు అత్యధికంగా 6,353 మంది సందర్శించగా రూ.31,76,500 ఆదాయం వచ్చిందని బొర్రా గుహల అధికారవర్గాలు తెలిపాయి.
- ప్రస్తుతం ఈనెల ఒకటి నుంచి 8వ తేదీ వరకు 3415 మంది సాహస క్రీడల్లో పాల్గొనగా 17,07,500 ఆదాయం వచ్చింది.

అక్టోబర్ 19 నుంచి ఈనెల 8 వరకు

విహరించిన వారి సంఖ్య	:	24,416
టికెట్ ధర	:	రూ.500
ఆదాయం	:	రూ.1,22,08,000
ప్రాజెక్టు వ్యయం	:	రూ.65 లక్షలు



తాజంగిలో మంచు అందాల మధ్య విహారం

తాజంగిలో మంచి ఆదరణ

చింతపల్లి రూరల్: మండలంలోని తాజంగి జలాశయం వద్ద ఏర్పాటుచేసిన జిప్‌లైన్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. విహరించేందుకు ప్రత్యేకంగా ఇక్కడికి పర్యాటకులు వస్తుంటారు. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో 2019లో ఏర్పాటు చేసిన ఈ జిప్‌లైన్‌ను తాజంగి పర్యాటక వికాస్ నిర్వహిస్తోంది. అప్పటిలో రూ.14లక్షలను ఐటీడీఏ వెచ్చించింది. టికెట్ ధర రూ.200 కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.9 లక్షల ఆదాయం సమకూరింది.

మరపురాని అనుభూతి



బొర్రా గుహల వద్ద జిప్‌లైన్‌పై విహారం మరపురాని అనుభూతి. అపురూపమైన గోస్తనీ నది ప్రకృతి అందాలను తిలకించా. మరపురాని అనుభూతిగా ఉండిపోతుంది.

– గణేష్, పర్యాటకుడు, నర్సీపట్నం

వీడియో సదుపాయం కల్పించాలి



లోయపై జిప్‌లైన్ విహారం చాలా థ్రిల్లింగ్ అన్పించింది. అయితే వీడియో తీసుకునే సదుపాయం ఉంటే బాగుంటుంది.ఈ దిశగా పర్యాటకశాఖ చర్యలు తీసుకోవాలి.

– ప్రకాష్, సందర్శకుడు, హైదరాబాద్

'సంకల్పం'తో సమన్యాయం

- జగనన్న పాలనలో అన్నివర్గాల ప్రజలకు మేలు
- అరకు ఎంపీ మాధవి
- సంకల్పయాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా విజయోత్సవాలు



అరకులో జైజగన్ నినాదం చేస్తున్న ఎంపీ మాధవి



విజయోత్సవ కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

అరకులోయ టౌన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూర్చారని అరకులోయ అసెంబ్లీ ఇన్‌చార్జి, ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. ప్రజాసంకల్ప యాత్ర చేపట్టి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆమె ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్, వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజా సంకలప్ప యాత్ర చేపట్టి 3,648 కిలో మీటర్లు పాదయాత్ర చేపట్టి ప్రజల సమస్యలు తెలుసుకున్నారన్నారు. అప్పట్లో అరకు పార్లమెంట్ పరిధిలోని సాలూరు, కురుపాం, పార్వతీపురం, పాలకొండ ప్రాంతంలో పాదయాత్రలో తాను పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. గిరిజన ప్రజలకు సంక్షేమ ఫలాల సకాలంలో అందిస్తున్నారన్నారు. అంబేద్కర్ కలలుగన్న స్వరాజ్యాన్ని తీసుకువచ్చేందుకు జగనన్న కృషి చేస్తున్నారన్నారు. లోకేష్ పాదయాత్ర తూతూమంత్రంగా నిర్వహించి మమ అనిపించారన్నారు. అరకు జెడ్పీటీసీ శెట్టి రోషిణి, సర్పంచ్‌లు సుస్మిత, దురియా భాస్కర్‌రావు, పాంగి సుబ్బా రావు, ఎంపీటీసీ దురియా ఆనంద్, పి. లలిత, వైస్ ఎంపీపీ సుమాంజలి, నాయకులు కూడ పాపారావు, సుక్రయ్య, గాశి, సందడి కొండబాబు, పట్టాసి దీనవల్లి, ప్రమీల, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు

సాక్షి, పాడేరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు,అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ప్రజా సంకల్పయాత్ర మంగళవారం నాటికి ఐదేళ్లు పూర్తికావడంతో పాడేరులోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి విజయోత్సవం నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాల్గుణ మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్ర ద్వారా గుర్తించిన సమస్యలన్నింటిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించారన్నారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకున్నారన్నారు. మారుమూల గ్రామాలకు రోడ్లు అభివృద్ధి చెందడంతో పాటు ప్రమాదకర గెడ్డలపై వంతెన నిర్మాణాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయన్నారు. అనంతరం ఆయన తన నివాసంలో అరకు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు.పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, విశ్వేశ్వరరాజు

ప్రజా సంకల్పయాత్ర ఓ ప్రభంజనం

సాక్షి, పాడేరు: ఏపీలో ప్రతిపక్ష నేత హోదాలో జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ఓ ప్రభంజనమని పాడేరు ఎమ్మెల్యే, అరకు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. ప్రజా సంకల్పయాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా పాడేరు పాతబస్టాండ్‌లో మంగళవారం విజయోత్సవం నిర్వహించారు.మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పాడేరు ఎమ్మెల్యేతో పాటు,వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం వారు ప్రజా సంకల్ప యాత్ర విజయోత్సవ కేక్‌ను కట్‌చేసి అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎన్నికల హామీలను సమర్థవంతంగా అమలుజేసీ సీఎం జగన్ చరిత్ర సృష్టించారన్నారు. పాడేరు సమన్వయకర్త విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గిరిజనులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందడం సంతోషంగా ఉందన్నారు. నవరత్నాల పథకాలతోను గిరిజనులకు లబ్ధి చేకూరిందన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు ,పాడేరు ఏఎంసీ చైర్మన్ కూతంగి సూరిబాబు,డైరెక్టర్ లకే రామసత్యవతి,జిల్లా వ్యవసాయ మండలి అధ్యక్షురాలు సరస్వతి,వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్గన్నదొర,సభ్యుడు సిరగం దశమూర్తి.పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడి చిట్టిబాబు, ఎంపీటీసీలు చల్లా చిట్టమ్మ,లకే రామకృష్ణపాత్రుడు, నరసింహమూర్తి, ముదిలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాటలకందని విషాదం

- సీతపల్లి వాగులో పడిన ఇద్దరిని రక్షించేందుకు విశ్వ ప్రయత్నం
- వాగులో గల్లంతు
- వారిద్దరూ బీబీఎం విద్యార్థులు
- మృతదేహాలను బయటకు తీసిన పోలీసులు
- రోదించిన కుటుంబ సభ్యులు



వాగు నుంచి మృతదేహాన్ని తీసుకువస్తున్న స్థానిక యువకులు



వాగు ఒడ్డుకు చేర్చిన జబ్బిర్ మృతదేహం



గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న సీఐ

రంపచోడవరం: మండలంలోని ఐ.పోలవరం వద్ద సీతపల్లి వాగులో పడి మంగళవారం ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన ఘటన ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. వారి భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులను అంధకారంలోకి నెట్టింది. ఏజెన్సీలో అందాలు చూసేందుకు స్నేహితులతో వచ్చిన విద్యార్థుల్లో రాజమహేంద్రవరం రాజేంద్రనగర్‌కు చెందిన షేక్ జబ్బిర్ (18), పేపరు మిల్లు ప్రాంతానికి చెందిన సుభర్షణి (18) వాగు మధ్యలో ఉన్న బండరాయిపై కూర్చొని మాట్లాడుకుంటుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. జబ్బిర్ ప్రమాదవశాత్తూ జారిపడిపోగా అతనిని రక్షించేందుకు ప్రయత్నించిన సుభర్షణి వాగులో పడిపోవడంతో ఇద్దరు మృతి చెందారు.

ఆఖరి పరీక్ష రాయకుండా..

సీతపల్లి వాగులో పడి మృతి చెందిన షేక్ జబ్బిర్, సుభర్షణి రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో మొదటి సంవత్సరం బీబీఎం చదువుతున్నారు. వీరు తోటి స్నేహితులు తరుణ్ రావిపాటి, విష్ణు మహంతి చిన్ను, షేక్ రోషిణీలతో కలిసి మంగళవారం ఉదయం పర్యాటక ప్రాంతం సీతపల్లి చేరుకున్నారు. అయితే వీరంతా మంగళవారం నాడు బీబీఎం ఆఖరి పరీక్ష రాయకుండానే సీతపల్లి వాగు వద్దకు వచ్చారు. సరదాగా గడుపుతున్న వీరిలో ఇద్దరిని మృత్యువు వాగు రూపంలో కబళించింది. వాగులో పడిపోయిన ఇద్దరిని రక్షించేందుకు తోటి స్నేహితులు విశ్వ ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వరరావు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాలింపు చర్యలు చేపట్టారు. ఇద్దరి మృతదేహాలు లభ్యం కావడంతో పోస్టుమార్టం నిమిత్తం వాటిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న సుభర్షణి తండ్రి రాజేంద్రకుమార్ ఏరియా ఆస్పత్రికి చేరుకుని రోదించిన తీరు అక్కడి వారిని కలిచి వేసింది. జబ్బిర్ తండ్రి కూడా ఆస్పత్రికి చేరుకుని రోదించారు. పరీక్ష రాయడానికి వెళ్లి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని వారు గుండెలవిసేలా రోదించారు.

అందాలు తిలకించేందుకు వచ్చి..

ఏజెన్సీ అందాలు చూసేందుకు వస్తున్న సందర్శకులు అజాగ్రత్తగా ఉన్నందు వల్లనే ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదం పొంచి ఉన్న కొండ వాగుల్లో సరదా కోసం దిగుతున్న వారు మృత్యు ఒడిలోకి జారిపోతున్నారు. సీతపల్లి వాగు వద్ద ప్రమాదకర పరిస్థితులు ఉన్నా సందర్శకులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు.

- మారేడుమిల్లి సమీపంలోని పాములేరు వద్ద ఏటా ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. కొండవాగులు వెడల్పు తక్కువగా ఉన్నప్పటికీ లోతు ఎక్కువగా ఉంటోంది. ఊబిలు కూడా ఉన్నందున ప్రవాహంలో పడిన వెంటనే కూరుకుపోయి ప్రాణాలు కోల్పోతున్నారు.

పీవీటీజీ గ్రామాలన్నింటికీ విద్యుత్ సౌకర్యం

ఏపీఈపీడీసీఎల్ విశాఖ ఎస్‌ఈ మహేంద్రనాథ్



లగిశపల్లి సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ మహేంద్రనాథ్

సాక్షి, పాడేరు: ఏజెన్సీలోని పీవీటీజీ గ్రామాలన్నింటికి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఏపీఈపీడీసీఎల్ ఉమ్మడి విశాఖ ఎస్‌ఈ మహేంద్రనాథ్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని లగిశపల్లి సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయం పరిధిలోని కాడెలి, లగిశపల్లి పంచాయతీల్లో విద్యుత్ సమస్యలపై ఆయన సమీక్షించారు. ఈ రెండు పంచాయతీల్లో విద్యుత్ లేని గ్రామాల వివరాలను తెలుసుకున్నారు. ఎస్టీ కుటుంబాలకు ఉచిత విద్యుత్ సేవలపై అవగాహన కల్పించారు. ప్రభు త్వ ఉద్యోగాలు చేస్తున్న గిరిజన కుటుంబాలకు రాయితీ విద్యుత్ ఆమలుకాదని, వారంతా విద్యుత్ వినియోగంపై నెలవారీ బిల్లులు తప్పనిసరిగా చెల్లించాలని సూచించారు.లగిశపల్లి సచివాలయం పరిధిలో ప్రభుత్వ ఉద్యోగులు విద్యుత్ బిల్లులు చెల్లిస్తుండడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

భద్రాచలం బస్సు వేళల్లో మార్పు

సాక్షి,పాడేరు: పాడేరు ఆర్టీసీ డిపో నుంచి తెలంగాణలోని భద్రాచలంకు నడుస్తున్న అంతర్రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీస్ వేళల్లో పలు మార్పులు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వతేదీ గురువారం నుంచి ఇవి అమల్లోకి వస్తాయన్నారు. పాడేరు నుంచి ఉదయం 6.30 గంటలకు బయలుదేరి ఉదయం 7.30 గంటలకు అరకులోయ చేరుకుంటుందన్నారు.అరకులోయ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఉదయం 8గంటలకు బయలుదేరి ఉదయం 9గంటలకు పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంటుందని తెలిపారు. అక్కడి నుంచి 9.30గంటలకు బయలుదేరి చింతపల్లి, సీలేరు, చింతూరు మీదుగా సాయంత్రం 6.15గంటలకు భద్రాచలం చేరుకుంటుందన్నారు.అలాగే మరుసటి రోజు ఉదయం 7.30గంటలకు భద్రాచలంలో బయలుదేరి సీలేరు, చింతపల్లి మీదుగా సాయంత్రం 4.15 గంటలకు పాడేరు చేరుకుంటుందని డిపో మేనేజర్ తెలిపారు. ప్రయాణికులు బస్సు వేళల్లో మార్పును గమనించాలని ఆయన కోరారు.

బైక్‌ను ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్

- టైరు కింద పడి భార్య మృతి
- భర్త రామకొండబాబుకు తీవ్ర గాయాలు



ఆయిల్ ట్యాంకర్ చక్రం కింద గిరిజ మృతదేహం



చికిత్స పొందుతున్న చినకొండబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

పాడేరు: ద్విచక్ర వాహనాన్ని ఆయిల్ ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో భార్య మృతి చెందగా భర్త తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం జరిగిన ఈ హృదయ విదారక ఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వనుగుపల్లి గ్రామానికి చెందిన పూజారి రామకొండబాబు, భార్య గిరిజాతో కలిసి వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై మంగళవారం పాడేరు వస్తున్నారు. నక్కలపుట్టు గ్రామం మలుపు వద్దకు వచ్చేసరికి వారి వాహనాన్ని వెనుక నుంచి అతివేగంగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో రామకొండబాబు దూరంగా తుళ్లిపోయారు. బైక్‌పై వెనుకన కూర్చున భార్య గిరిజ ట్యాంకర్ ఎడమవైపు టైరుకింద పడిపోయింది. ఆమెను కొంతదూరం ట్యాంకర్ ఈడ్చుకుపోవడంతో తీవ్రంగా గాయపడి సంఘటన స్థలంలోనే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన రామకొండబాబును స్థానికులు పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇలావుండగా పూజారి గిరిజ వైఎస్సార్‌సీపీ గృహ సారథిగా పనిచేస్తున్నారు. ఆమె మృతి సమాచారాన్ని తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె భర్త రామకొండబాబును ఆమెతోపాటు వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, కించూరు సర్పంచ్ వంతాల రాంబాబు తదితరులు పరామర్శించారు. దహన సంస్కారాల నిమిత్తం తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పార్టీ తరపున ఇన్సూరెన్స్, ఇతర పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పేర్కొన్నారు.

అప్పన్న దేవస్థానానికి రూ.4.15 లక్షల విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం మాధవదార ప్రాంతానికి చెందిన ఎస్.గురునాథరావు రూ.3.15 లక్షలు, గోసంరక్షణ పథకానికి లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. మొత్తం 4.15లక్షల విరాళాన్ని చెక్కురూపంలో అన్నప్రసాద పథకం ఏఈవో పాలూరి నరసింగరావుకి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామి దర్శనం కల్పించి ప్రసాదాన్ని అందజేశారు.



ఏఈవోకు చెక్కు అందజేస్తున్న దాత

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే గుర్తింపు రద్దు

ఆర్జేడీ జ్యోతి కుమారి

విశాఖ విద్య: సంక్రాంతి సెలవుల్లో తరగతులు నిర్వహించే స్కూళ్ల గుర్తింపు రద్దు చేస్తామని విద్యాశాఖ ఆర్జేడీ ఎం.జ్యోతి కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా క్యాలెండర్ మేరకు ఈ నెల 18 వరకు ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇవ్వాల్సిందేనన్నారు. నిబంధనలు అతిక్రమించినట్లు తెలిస్తే, సంబంధిత పాఠశాలల గుర్తింపు రద్దుతో పాటు, యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు. ఈ విషయంలో డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈవోలు తగిన దృష్టి పెట్టాలన్నారు.

21న మోదకొండమ్మ తీర్థం



సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, కమిటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి తీర్థ మహోత్సవాన్ని ఈనెల 21వతేదీన ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన పట్టణ పెద్దలు నిర్ణయించారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఏటా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో తీర్థ మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈమేరకు ఈఏడాది కూడా అత్యంత ఘనంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు, ఇతర ప్రతినిధులు రొబ్బా నాగభూషణంరాజు, గంగన్నపడాల్, కురుసా నాగభూషణం, శివరాత్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే పేదలకు భరోసా

ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు



ఎటపాకలో కొత్తగా మంజూరైన పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు



కూనవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, చిత్రంలో ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ తదితరులు

ఎటపాక: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలనలో పేదలకు భరోసా లభించిందని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి,ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు. కొత్తగా మంజూరైన, పెరిగిన రూ.3వేల పింఛన్ నగదును మంగళవారం ఎటపాకలో పంపిణీ చేశారు. మండలంలో మంజూరైన 70 కొత్తపింఛన్లు, 6,260 మందికి వివిధ రకాల పింఛన్ నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల అరాచకాలకు భిన్నంగా లబ్ధిదారులకు నేరుగా పింఛన్లు, వివిధ సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్రంగా దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో ముఖ్యమంత్రి నిలిపారని కొనియాడారు. టీడీపీ ప్రభుత్వంలో పింఛను పొందేందుకు వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పలు అవస్థలకు గురయ్యేవారని చెప్పారు. రానున్న కాలంలో మరిన్ని సంక్షేమ పథకాలు అందించాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తేవాలని కోరారు. అనంతరం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ సుస్మిత,ఎంపీపీ కామేశ్వరి,సొసైటీ చైర్మన్ లక్ష్మణరావు, సచివాలయాల కన్వీనర్ ప్రశాంత్, పార్టీ మండల కన్వీనర్ తానికొండ వాసు, నేతలు నర్సింహారావు,రేవతి,కురినాల వెంకట్,వెంకటరామారావు,నాగేశ్వరావు,శివ,నాగలక్ష్మి,కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల కష్టాలు చూసే సంక్షేమ పథకాలకు శ్రీకారం

కూనవరం: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రతి పేదవాడి కష్టాన్ని కళ్లారా చూసి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ మైదానంలో మంగళవారం నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పథకాలను చూసి ఓర్వలేక టీడీపీ విమర్శలు చేస్తోందన్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా కూనవరం మండలంలో రూ.120 కోట్లను పేదలకు పంపిణీ చేసిందన్నారు. ఈకార్యక్రమంలో ఎస్టీ కమిషన్ రాష్ట్ర డైరెక్టర్ చిచ్చడి మురళి, ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, మండల జేసీఎస్ ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, మేరుకులం, ఆరెకటిక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు దీకొండ గంగాధరరావు, అరవా వెంకటరామారావు, మాజీ వైఎస్ ఎంపీపీ గుజ్జాబాబు, ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి, వ్యవసాయ కమిటీ చైర్మన్ ఇంటిం పూర్ణానందం, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి నోముల కొండలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు భరతమూర్తి, కొమ్మాని మోహన్‌రావు, మహిళా ఉపాధ్యక్షురాలు కొమ్మాని సునీత తదితరులు పాల్గొన్నారు.

పోర్టును సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం



పోర్టును సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం

విశాఖ సిటీ: భారత్ దర్శన్‌లో భాగంగా 2022 ట్రైనీ ఐఏఎస్ అధికారుల(బ్యాచ్-3) బృందం మంగళవారం విశాఖ పోర్టు అథారిటీని సందర్శించింది. పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే బృందానికి స్వాగతం పలికారు. జాతీయంగా కీలకమైన మెరైన్, లాజిస్టిక్స్ సెక్టార్‌లో మౌలిక వసతులపై అవగాహన కోసం ఈ బృందం పోర్టును సందర్శించింది. ఈ సందర్భంగా పోర్టులో జరిగే కార్యకలాపాలు, ఇక్కడి మౌలిక వసతులు, సాంకేతికత, కాలుష్య స్థాయిలు, వాణిజ్య అభివృద్ధిలో పోర్టు పాత్ర వంటి అంశాలను ట్రైనీ ఐఏఎస్‌లు పరిశీలించారు. పోర్టులో జరుగుతున్న ఎగుమతులు, దిగుమతులు, సరుకు రవాణా సామర్థ్యం, ఆధునికీకరణ, యాంత్రీకరణ, కవర్డ్ స్టోరేజ్ వసతులు, సోలార్ పవర్ ప్లాంట్, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, పెట్టుబడి అవకాశాలు, ఇటీవలే అభివృద్ధి చేసిన అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్, ట్రక్ పార్కింగ్ టెర్మినల్, ఎగుమతులు దిగుమతులకు ఉన్న అవకాశాలను పోర్టు డిప్యూటీ చైర్మన్‌తో పాటు వివిధ విభాగాల అధిపతులు వివరించారు.

నేటి నుంచి వంజంగి హిల్స్‌కు అనుమతి

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: పర్యాటక ప్రాంతం వంజంగి హిల్స్‌కు ఈనెల 10వతేదీ బుధవారం నుంచి పర్యాటకులను అనుమతిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వంజంగి హిల్స్‌లో స్వచ్ఛ కార్యక్రమాలను పురస్కరించుకుని వారం రోజుల పాటు పర్యాటకులను అనుమతించలేదన్నారు. ప్లాస్టిక్‌తో పాటు ఇతర వ్యర్థాలను కార్మిక సిబ్బంది తొలగించారని పేర్కొన్నారు. రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, డొంకలను నరికివేయడంతో పాటు రోడ్డును అభివృద్ధి చేసినట్టు కలెక్టర్ తెలిపారు.



వంజంగిలో సిబ్బంది సేకరించిన చెత్త

హిల్స్‌పై ప్లాస్టిక్ నిషేధం

వంజంగి కొండలపై ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలుజేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు.



క్లీన్‌గా మారిన వంజంగి హిల్స్ ప్రాంతం

పర్యాటకులు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాస్టిక్ సామగ్రిని తీసుకురావద్దన్నారు.ప్లాస్టిక్ వస్తువులలో తాగునీరు,ఆహారం తదితర సామిగ్రిని కొండపైకి అనుమతించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

'ఆయుష్మాన్ భారత్' నమోదు వేగవంతం

ఐటీడీఏ పీవో అభిషేక్



గుమ్మడిగండువ గ్రామానికి కాలినడకన వెళుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్



గుమ్మడిగండువలో ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న పీవో అభిషేక్

హుకుంపేట: ఆయుష్మాన్ భారత్ కార్డుల ప్రయోజనాలపై గిరిజన గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. భీమవరం పంచాయతీ గుమ్మడిగండువ గ్రామంలో జరుగుతున్న ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. భీమవరం గ్రామం నుంచి కాలినడకన గుమ్మడిగండువకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రతి పీవీటీజీ కుటుంబానికి ఆయుష్మాన్ భారత్ కార్డును అందించాలని సూచించారు. ప్రధాన మంత్రి జన్‌మన్ పథకంలో అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్లు, తాగునీరు, మరుగుదొడ్లు, రహదారి, విద్యుత్ సదుపాయలు కల్పించనున్నట్టు చెప్పారు. ఉజ్వల్ పథకంలో ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఇల్లు నిర్మించుకునే వారికి రూ. 2.39లక్షలు ప్రభుత్వం మంజురు చేస్తుందని చెప్పారు. భీమవరం పంచాయతీలో 24 మందికి ఇళ్లు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. రైతు భరోసా పథకం మంజూరు కాని అర్హుల జాబితాను సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మేనరికపు వివాహాల వల్ల సికిల్ సెల్ ఎనీమా వస్తోందని, 40ఏళ్ల లోపు వారికి సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు ప్రభుత్వం రూ.10వేల చొప్పున పెన్షన్ అందిస్తోందని తెలిపారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను పరిశీలించి, భవనానికి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరావు,హౌసింగ్ ఏఈ గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

14న సింహగిరిపై గోదా కల్యాణం

- 16న గజేంద్రమోక్షం
- ఈ నెల 11 నుంచి 17 వరకు ఆర్జిత సేవల రద్దు
- దర్శనాల వేళల్లో మార్పులు



సింహాచలం: భోగి పర్వదినం పురస్కరించుకుని ఈ నెల 14న సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో గోదా కల్యాణాన్ని విశేషంగా నిర్వహిస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి కల్యాణోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం జరిగే నిత్యకల్యాణం కూడా గోదా కల్యాణంతో కలిపి నిర్వహిస్తామని వెల్లడించారు. భక్తులంతా ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15న మకర సంక్రాంతి పురస్కరించుకుని ఉత్తరాయణం పుణ్యకాలం పూజలు సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు దర్శనాలు ఉండవన్నారు. 16న కనుమ పురస్కరించుకుని కొండదిగువ పూలతోటలో గజేంద్రమోక్షం ఉత్సవం ఉంటుందన్నారు. ఆ రోజు సింహగిరిపై సాయంత్రం 4 గంటలకి స్వామి వారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని కొండ దిగువకి తీసుకెళ్తామన్నారు. గజేంద్ర మోక్షం ఉత్సవం అనంతరం రాత్రి అడవివరం పుర వీధుల్లో స్వామిని గజ వాహనంపై తిరువీధి నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున ఈ ఉత్సవంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ ఉత్సవం సందర్భంగా 16న సాయంత్రం 6 గంటల తర్వాత సింహగిరిపై స్వామి దర్శనాలు లభించవన్నారు. తిరిగి 17న ఉదయం 6.30 గంటల నుంచి యథావిధిగా దర్శనాలు ఉంటాయన్నారు. ఈ నెల 11 నుంచి 17 వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు వెల్లడించారు. అలాగే సాయంత్రం 7 గంటల తర్వాత దర్శనాలు లభించవన్నారు. ఈ నెల 12న కూడారై ఉత్సవం సందర్భంగా ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు దర్శనాలు లభించవని వివరించారు. భక్తులంతా ఈ విషయాలని గమనించాలని ఈవో కోరారు.

అగ్రిప్రమాదాలు సంభవించకుండా చర్యలు

సబ్ డీఎఫ్‌వో శ్రీరామారావు



అటవీ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సబ్ డీఎఫ్‌వో శ్రీరామారావు

రాజవొమ్మంగి: రక్షిత అటవీప్రాంతంలో అగ్నిప్రమాదాలు సంభవించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అడ్డతీగల సబ్ డీఎఫ్‌వో శ్రీరామారావు తెలిపారు. స్థానిక అటవీక్షేత్ర కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఫారెస్ట్ రేంజ్ అధికారి సెహన్నా, ఇతర అటవీశాఖ అధికారులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. వేసవిలో అగ్నిప్రమాదాలు సంభవించకుండా ఇప్పటి నుంచే అడవుల్లో కనీసం మూడు మీటర్ల వెడల్పుతో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. కలప స్మగ్లింగ్‌ను సమర్థంగా అరికట్టాలని ఆదేశించారు. ఎవరూ అజాగ్రత్తగా ఉండవద్దని, నిత్యం గస్తీ తిరగాలని బేస్ క్యాంపు సిబ్బందికి సూచించారు. త్వరలో రాజవొమ్మంగి అటవీక్షేత్రంలో 54 హెక్టార్లలో చేపట్టనున్న టేకు హార్వెస్టింగ్ పనులకు సంబంధించి ఎన్ని చెట్లు ఉన్నాయి, తదితర ఎన్యూమరేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. రేంజ్ అధికారి సెహన్నాతో కలసి ఆయన లాగరాయి, లబ్బర్తి బీట్‌లలోని టేకు వనాలను పరిశీలించారు.

యోగాసనాల్లో కొత్త చరిత్ర



యోగాసనాలు చేయిస్తున్న రమేష్

ఎంవీపీకాలనీ: యోగాసనాల్లో ఓం శ్రీ యోగా సంస్థ సరికొత్త చరిత్ర సృష్టించింది. 216 రౌండ్లు, 108 రౌండ్లు కేటగిరిల్లో రికార్డు స్థాయిలో సూర్యనమస్కారాలు చేసింది. దీంతో ఈ సంస్థకు యోగాసనా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ద్వారా వరల్డ్ రికార్డ్ లభించింది. విశాఖలోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా సెంటర్ వ్యవస్థాపకుడు చిలకా వెంకట రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉభయగోదావరి, హైదరాబాద్, ఉత్తరాంధ్రకు చెందిన యోగా అభ్యాసకులు పాల్గొని 88 నిమిషాల వ్యవధిలో 2,592 సూర్యనమస్కారాలు చేసి రికార్డు నెలకొల్పారు. 216 రౌండ్ల కేటగిరిలో 163 మంది, 108 రౌండ్ల కేటగిరిలో 107 మంది యోగాసనాలు పూర్తిచేశారు. యోగాసనా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు రికార్డు నమోదు చేసి చిలకా వెంకట రమేష్‌కు సర్టిఫికెట్ అందజేశారు. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావడం పట్ల పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌ఎస్ అధికారి శిఖాదర్బారి, ఇంటర్నేషనల్ కోచ్ డాక్టర్ సయ్యిద్ రఫీ, యోగాసనా వరల్డ్ రికార్డ్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.పరాసర్, చీఫ్ ఎడిటర్ మల్విజ వాజ్పేయి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓం శ్రీ యోగ సెంటర్ వ్యవస్థాపకుడు చిలకా వెంకట రమేష్‌ను యోగాసనా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ఆంధ్రప్రదేశ్ హెడ్‌గా నియమించారు. సీఐ కల్యాణ్ సౌత్ జోన్ ప్రతినిధిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గుజరాత్‌లో ప్రధాని నరేంద్రమోదీ హాజరైన కార్యక్రమానికి యోగాసనాల వరల్డ్ రికార్డ్ ఉందన్నారు. ప్రస్తుతం తమ సంస్థ ఆ రికార్డ్‌ను అదిగమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వారికి అభినందనలు తెలిపారు.

సాధారణ చార్జీలతో రైట్‌రైట్

సంక్రాంతికి 250 ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు



దాబాగార్డెన్స్(విశాఖ): సంక్రాంతి పురస్కరించుకొని ఏపీఎస్‌ఆర్‌టీసీ సాధారణ చార్జీలతోనే ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్టు ఏపీఎస్‌ఆర్‌టీసీ విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు పేర్కొన్నారు. మంగళవారం నుంచి 21వ తేదీ వరకు అదనంగా 250 బస్సులతో విజయవాడ, హైదరాబాద్, అమలాపురం, భీమవరం తదితర సుదూర ప్రాంత బస్సులతో పాటు విజయనగరం, రాజాం, పాలకొండ, పార్వతీపురం, శ్రీకాకుళం, సోంపేట, ఇచ్ఛాపురం, కాకినాడ, రాజమండ్రి తదితర ప్రాంతాలకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు చెప్పారు. ప్రత్యేక బస్సులకు సంబంధించి ముందుగా టికెట్ తీసుకునే సౌలభ్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. ముందుగా రిజర్వేషన్ చేసుకునే ప్రయాణికులు ఆన్‌లైన్‌లో టీటీటీ. ఏజెట్టుభిగ్నా జీపై. జీ. గానీ లేదా ముఖ్య కూడలిలో ఆర్‌టీసీకి సంబంధించిన ఏటీబీ ఏజెంట్ల వద్ద టికెట్లు రిజర్వ్ చేసుకోవచ్చని అప్పలరాజు తెలిపారు.

పది శాతం రాయితీ

రానుపోను టికెట్ ఒకేసారి బుక్ చేసుకున్న ప్రయాణికులకు చార్జీలో 10 శాతం రాయితీ కల్పించినట్టు ప్రజా రవాణా అధికారి తెలిపారు. సంక్రాంతి ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలతోనే ప్రయాణించవచ్చని ఆయన తెలిపారు. రూట్ల వారీగా అదనపు బస్సుల వివరాలను అప్పలరాజు వెల్లడించారు.

విశాఖ నుంచి హైదరాబాద్‌కు	:	30 బస్సులు
విశాఖ నుంచి విజయవాడకు	:	60 బస్సులు
విశాఖ నుంచి శ్రీకాకుళం, రాజాం, పాలకొండ, పార్వతీపురం, సోంపేట, బొబ్బిలి, పలాసకు	:	100 బస్సులు
విశాఖ నుంచి అమలాపురం, భీమవరంకు	:	10 బస్సులు
విశాఖ నుంచి రాజమండ్రికి	:	25 బస్సులు
విశాఖ నుంచి కాకినాడకు	:	25 బస్సులు

కిక్కిరిసిన 'తారుమారు'

- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన గిరిజనులు
- ఉత్పత్తులు విక్రయించి పండగ సామగ్రి కొనుగోలు
- రూ.2.50 కోట్ల మేర లావాదేవీలు
- సంక్రాంతి పండగకు ఒకరికొకరు ఆహ్వానం



జి.మాడుగులలో తారుమారు(పండగ సంత)సంత



కొనుగోలుదారులతో రద్దీగా దుస్తుల దుకాణాలు

జి.మాడుగుల: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన తారుమారు సంతకు వచ్చిన గిరిజనులతో కిక్కిరిసిపోయింది. ఏటా సంక్రాంతి పండగకు ముందుగా వచ్చే మంగళవారం రోజున ఈ సంత నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలోని నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు.

అటవీ, వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించి..

గిరిజన రైతులు అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చి విక్రయించారు. వచ్చిన నగదుతో కొత్త దుస్తులు, పండగ సామగ్రి, పులంగం తయారీకి కుండలు కొనుగోలు చేశారు. సంతకు వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్పంచ్ కిముదు రాంబాబు, మత్స్యరాస నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మహిళలు గాజుల, యువతులు అలంకరణ వస్తువులు కొనుగోలు చేశారు. లావాదేవీలు మొత్తంమ్మీద సుమారు రూ.2 నుంచి రూ.2.50 కోట్ల మేర జరిగాయి.

కల్లు దుకాణాల వద్ద సందడి

జీలుగు, మడ్డి కల్లు కొనుగోలు చేసి దుకాణాల వద్ద స్నేహితులు, కుటుంబసభ్యులు ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకొని విందు చేసుకున్నారు. సంక్రాంతి పండుగకు ఆహ్వానించుకున్నారు. సంక్రాంతి పండగకు గ్రామాల్లో థింసా, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన వాయిద్య పరికరాలను కొనుగోలు చేశారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా..

తారుమారు సంతకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సీఐ రమేష్ అధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాస్ పర్యవేక్షించారు. తహసీల్దార్ కార్యాలయ జంక్షన్, ఈదులబయలు, పీహెచ్‌సీ జంక్షన్ ప్రాంతాల్లో వాహనాలను దారిమళ్లించారు. బందోబస్తు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, సర్పంచ్‌లు కిముదు రాంబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంతకు కలిసి వచ్చారు. అందరితో ఆప్యాయంగా పలకరించారు. ఆలింగనాలు, ఒకరినొకరు నమస్కారాలు సందడి చేశారు.



సంతలో ప్రజలకు అభివాదం తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ పాడేరు సమన్వయకర్త విశ్వేశ్వరరాజు



దోకీతో కల్లు తాగుతున్న గిరిజనుడు